సాక్షి
బాపట్ల

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



బొల్లా ఆధ్వర్యంలో పడిపూజ

వినుకొండ: స్థానిక బొల్లా కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ జరిగింది. రెండు వేల మందికిపైగా స్వాములు పాల్గొన్నారు.



చప్టాపైకి చేరిన నీరు

నరసరావుపేట టౌన్: తుఫాన్ వల్ల మంగళవారం స్థానిక స్వర్గపురి వద్ద లో-లెవల్ చప్టాపైకి వర్షపునీరు చేరింది. సీఐ అమరేంద్ర పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

9న జాతీయ మెగా లోక్ అదాలత్



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల 9న జిల్లాలోని అన్ని కోర్టులలో జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముంచెత్తిన మిచాంగ్

స్తంభించిన జనజీవనం

- 60 మీటర్ల మేర చొచ్చుకొచ్చిన సముద్రం
- భారీగా ఈదురుగాలులు, వర్షం
- వేలాది ఎకరాల్లో నేలవాలిన వరి
- నీట మునిగిన మిర్చి, శనగ పంటలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- లోతట్టు ప్రాంత ప్రజలు తుఫాన్ షెల్టర్లకు తరలింపు
- నీట మునిగిన పంటను పరిశీలించిన మంత్రి మేరుగ నాగార్జున
- సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్



భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో నీటిలో నానుతున్న వరి పనలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మిచాంగ్ తుఫాన్ బాపట్ల జిల్లాను అతలాకుతలం చేసింది. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల సమీపంలోని సూర్యలంక వద్ద తీరం దాటింది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తుఫాన్ తీరం దాటినా మధ్యాహ్నం 12 గంటల నుంచే బాపట్ల, సూర్యలంక, చీరాల వాడరేవు, నిజాంపట్నం తీర ప్రాంతాల్లో సముద్రం ఉగ్రరూపం దాల్చింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీశాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. చీరాల ప్రాంతంలో సముద్రం 60 మీటర్ల మేర ముందుకు చొచ్చుకొచ్చింది. బాపట్ల, నిజాంపట్నం ప్రాంతంలో 20 నుంచి 30 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. దీంతో తీరం మొత్తం కోతకు గురైంది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు నేలకూలాయి. పూరి గుడిసెలు నేల మట్టం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి నీరు చేరింది. సూర్యలంక తీరంలోని పోలీసు అవుట్‌పోస్టు దెబ్బతింది. బీచ్‌కు వచ్చేవారి కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక స్నానపు షెడ్లు కొట్టుకుపోయాయి. మంగళవారం రాత్రి వరకు ఈదురుగాలులు, వర్షం కొనసాగే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఈదురుగాలులకు జిల్లా వ్యాప్తంగా వందలాది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల చెట్లు నేలకూలాయి. కొన్ని ప్రాంతాల్లో పూరిళ్లు కూలిపోయాయి. సోమవారం రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో వంకలు, వాగులకు నీరు చేరింది. పలుచోట్ల రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అద్దంకి ప్రాంతంలో గుండ్లకమ్మ, నల్లవాగులు పొంగి ప్రవహించాయి. పర్చూరు నియోజకవర్గంలోని పోలూరు, వింజనంపాడు, యద్దనపూడి వాగులు నీటితో పొంగి పొర్లాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ ఆదేశాలతో సహాయక చర్యలు

తుఫాన్ ప్రభావంతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ బాపట్ల, చీరాల ప్రాంతాల్లోనే ఉండి జిల్లా, మండల స్థాయి అధికారులను బృందాలుగా విభజించి సహాయక చర్యలు పర్యవేక్షించారు. జిల్లా స్థాయి అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఉండి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూశారు. రెండు రోజుల ముందు నుంచే బాపట్ల, చీరాల, రేపల్లె ప్రాంతాల్లోని మూడువేల మందికి పైగా లోతట్టు ప్రాంతాల ప్రజలను తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అన్ని సౌకర్యాలు సమకూర్చారు. వర్షం తీవ్రత పెరిగే పరిస్థితుల్లో మరింత మందికి షెల్టర్లలో వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. లోతట్టు ప్రాంతాల వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. మంగళవారం మంత్రి మేరుగ నాగార్జున వేమూరు ప్రాంతంలో తుఫాన్‌కు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

నీట మునిగిన ఉద్యాన పంటలు

తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సాగులో ఉన్న పలు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 15,220 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. తుఫాన్ ప్రభావంతో మిర్చి పంట ఐదు వేల హెక్టార్లకుపైగా నీట మునిగింది. కూరగాయల పంటలు ఐదువేల హెక్టార్లకుపైగా నీట మునిగాయి. 1444 హెక్టార్లలో అరటి సాగులో ఉండగా, ఈదురుగాలులకు చాలా వరకు నేలకొరిగాయి.

అంధకారంలో జిల్లా

తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని బాపట్ల, చీరాల, తెనాలి డివిజన్‌ల పరిధిలో వందలాది విద్యుత్ స్తంభాలు కిందపడ్డాయి. బాపట్ల డివిజన్‌లో 45, చీరాలలో 35, తెనాలి పరిధిలో 20 చొప్పున వందకు పైగా ఇన్సులేటర్లు పాడైపోయాయి. చెట్లు, చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు వేగవంతం చేశారు.

13 మండలాలపై ప్రభావం

జిల్లాలోని 13 మండలాల పరిధిలో 177 గ్రామాల్లో తుఫాన్ ప్రభావం కనిపించింది. 63,770 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. 485 హెక్టార్లలో వేరుశనగ, 1511 హెక్టార్లలో పొగాకు, 477 హెక్టార్లలో మొక్కజొన్న, 4,957 హెక్టార్లలో శనగ, 2947 హెక్టార్లలో మినుముతోపాటు, 889 హెక్టార్లలో మిగిలిన పలు రకాల పంటలు నీట మునిగి పనికి రాకుండా పోయాయి. మొత్తంగా 75,036 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రాథమిక అంచనా మాత్రమే. రాబోవు రెండురోజుల్లో ఈ లెక్కలు మరింత పెరిగే అవకాశం ఉంది. తుఫాన్ తగ్గాక అధికారులు పూర్తిస్థాయిలో అంచనాలు రూపొందించనున్నారు. మిర్చి పంట వర్షపు నీటిలో మునిగి దెబ్బతింది. చేతికి వచ్చిన పంటలు నీటిపాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

భారీ వర్షపాతం నమోదు

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మూడురోజుల పాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం నాటికి జిల్లాలో అత్యధికంగా కొరిశపాడు మండలంలో 24 సెం.మీ వర్షం కురిసింది. చీరాలలో 29 సెం.మీ, యద్దనపూడిలో 18 సెం.మీ, పిట్టలవానిపాలెంలో 18 సెం.మీ, కారంచేడు 17 సెం.మీ, కొల్లూరు 17 సెం.మీ, ఇంకొల్లులో 15 సెం.మీ, పర్చూరులో 14.5 సెం.మీ, వేమూరులో 14 సెం.మీ, అమర్తలూరులో 13 సెం.మీ చొప్పున వర్షం కురిసింది. మిగిలిన 15 మండలాల్లో ఐదు నుంచి 12 సెం.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

నేడు విద్యాసంస్థలకు సెలవు

బాపట్లఅర్బన్: తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలో అంగన్‌వాడీ స్కూల్స్, పాఠశాలలకు కళాశాలలకు బుధవారం సెలవు దినంగా ప్రకటించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



కొల్లూరు సమీపంలో వర్షపు నీటిలో ఉన్న ధాన్యం బస్తాలను మోసుకెళుతున్న రైతులు



పిట్టలవానిపాలెం మండలం జీఎన్ పాలెంలో వర్షపు నీటిలో మునిగిన గృహం



పిట్టలవానిపాలెం మండలం చందోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విరిగి రహదారిపై పడిన చెట్టు

న్యూస్‌రీల్

చురుగ్గా సహాయక చర్యలు

వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రకృతి విపత్తు సమయంలో ఆపదలో ఉన్న బాధితులకు అండగా నిలవాలన్న సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సహాయక చర్యలు చురుగ్గా కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మంగళవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ విపత్తు సమయంలో సీఎం వైఎస్ జగన్ బాధితులకు, రైతులకు అండగా నిలిచారని చెప్పారు. ప్రభుత్వం నిబంధనలను సవరించి ధాన్యం కొనుగోలు చేస్తోందని వివరించారు. ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ.. అధికారులకు సహకరిస్తూ బాధితులకు మరింత అండగా నిలవాలన్నారు.

దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేత



విజయవాడ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల విజయవాడ దుర్గగుడి ఘాట్ రోడ్డును మంగళవారం తెల్లవారుజామున అధికారులు మూసివేశారు. దేవస్థాన బస్సులను రద్దు చేశారు. భక్తుల ద్విచక్ర వాహనాలు, కార్లను కనకదుర్గ నగర్ వైపు అనుమతించారు. ఘాట్ రోడ్డులో కొండ రాళ్లు జారిపడే అవకాశం ఉందని భక్తుల రాకపోకలను నిలిపివేశారు. మహామండపం దిగువన భక్తులు తమ వాహనాలను నిలుపుకుని మెట్లు, లిఫ్ట్ ద్వారా కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది.

యార్డులో 22,596 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 20,791 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 22,596 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి రూ.23,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,980 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

చెరువుగా మారిన పొలాన్ని చూసి రైతు మృతి

మార్టూరు: తాను సాగు చేస్తున్న పొలం చెరువుగా మారడాన్ని చూసి గుండెపోటుతో అక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలం తాటివారిపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. అందిన వివరాల మేరకు.. స్థానిక రైతు గంగవరపు మస్తాన్‌రావు (60) ఎకరా రూ.25 వేల చొప్పున తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకొని వారం రోజుల కిందట శనగ విత్తనం నాటాడు. తుఫాన్ కారణంగా పొలం చూసి వద్దామని ఉదయం 11 గంటలకు వెళ్లిన మస్తాన్‌రావు నీటితో చెరువుగా మారిన పొలాన్ని చూసి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్‌రావు ఎంతకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతుడు మస్తాన్‌రావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు ఒకటిన్నర ఎకరా సొంత భూమి ఉంది.

పంట పొలాలను పరిశీలించిన మంత్రి మేరుగ



వేమూరులో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: తుఫాన్ తాకిడికి పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం అదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరులోని వరహాపురం రోడ్డులో నీటి మునిగిన పంట పొలాలను మంత్రి మంగళవారం పరిశీలించారు. మేరుగ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుఫాన్ పరిస్థితులను సమీక్షిస్తున్నారని తెలిపారు. తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు జరిగిన పంట నష్టం అంచనా వేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించామని, వర్షాలు తగ్గిన తర్వాత పంట నష్టం అంచనాలు ప్రారంభిస్తారని తెలిపారు. రైతులు అధైర్య పడవద్దన్నారు. వర్షాలకు తడిసిన వరి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, చుండూరు, అమర్తలూరు మండలాల్లో పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.

పునరావాస కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే కోన

బాపట్లఅర్బన్: బాపట్ల తీరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం రెండు రోజులు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండలంలోని అడవిపల్లెపాలెం, అడవి గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే కోన రఘుపతి పరిశీలించారు. సౌకర్యాల కల్పన గురించి ఆరా తీశారు. భయపడొద్దని, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని భరోసా కల్పించారు. తుపాను బాధితుల కోసం వండిన ఆహార పదార్థాలను తిని నాణ్యతను పరిశీలించారు. సూర్యలంక తుపాను షెల్టర్‌లో ఉన్న బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

చీరాల ప్రాంతం అతలాకుతలం

వాడరేవు తీర ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ జిందాల్



నీట మునిగిన చీరాల-వేటపాలెం ప్రధాన రహదారి

చీరాల/వేటపాలెం: మిచాంగ్ తుఫాన్‌కు చీరాల ప్రాంతం అతలాకుతలం అయ్యింది. జనజీవనం స్తంభించింది. తుఫాన్ బాపట్ల వద్ద తీరం దాటే సమయంలో 110-120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చీరాల, వేటపాలెం, అద్దంకి, పర్చూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా వేరుశనగ, శనగ పంటలు పూర్తిగా మునిగాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా లేకపోవడంతో చీరాల ప్రాంతం అంధకారంలో ఉంది. సముద్రం సుమారు 100 అడుగుల మేర ముందుకు వచ్చింది. సుమారు 15 మీటర్ల మేర అలలు ఎగసిపడ్డాయి. దీంతో తీరం కోతకు గురైంది. ఈ నేపథ్యంలో మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ వాడరేవు తీర ప్రాంతాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, పోలీస్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. కావూరివారిపాలెం, వాడరేవులో పూరిగుడిసెలు కూలాయి. మత్స్యకారులు బోట్లను, వలలను ఒడ్డుకు తెచ్చుకున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి నష్టం లేనప్పటికీ పరిస్థితి గందరగోళంగా మారింది. వర్షం కారణంగా మొక్కజొన్న పంట దెబ్బతింది. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొని విద్యుత్ వైర్లపై పడిన చెట్టు కొమ్మలను తొలగించారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కరణం

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా జలమయం అయిన పట్టణంలోని శివారు ప్రాంతాలను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. సెయింట్ ఆన్స్ స్కూలు సమీపంలోని అరవ కాలనీని సందర్శించి వారికి స్కూల్‌లో పునరావాసాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దండుబాట ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ బాషా, ఎస్పీ వకుల్, ఎమ్మెల్యే కరణం

వేటపాలెం మండలంలో 1720 ఎకరాల్లో పంటలకు నష్టం

మిచాంగ్ తుఫాన్ మండలంలో బీభత్సం సృష్టించింది. మండలంలోని ఆణుమల్లిపేటలో విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. అంతేకాకుండా చీరాల-వేటపాలెం ప్రధాన రహదారిలో మోకాలి లోతు నీట మునగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. మండలంలో రామాపురం వద్ద గల సీఈసీ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టి సుబ్బయ్యపాలెంలోని ప్రభుత్వ పాఠశాల, ఊటుకూరి సుబ్బయ్యపాలెం, బచ్చులవారిపాలెం, రామచంద్రాపురం కఠారివారిపాలెంలో ఏర్పాటుచేసిన తుఫాన్ షెల్టర్లలో అన్ని ఏర్పాట్లు చేశారు. తీర ప్రాంత గ్రామాలను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సందర్శించి వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మండల పరిధిలో 1720 ఎకరాల్లో సాగుచేసిన వివిధ పంట పొలాల్లో నష్టం వాటిల్లిందని చెప్పారు. వరి 700, వేరుశనగ 400, మినుము 500, మొక్కజొన్న 100, కూరగాయల పంటలు 20 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. అద్దంకి నియోజకవర్గంలో దాదాపు 2600 ఎకరాల పైచిలుకు పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

స్తంభించిన రాకపోకలు

పర్చూరు నియోజకవర్గం మార్టూరులో గుంటూరు-చెన్నై వెళ్లే వాహనాలను స్థానిక రాజుపాలెం జంక్షన్‌లోని రెస్ట్ ఏరియాలో సుమారు 400 వాహనాలు అధికారులు నిలిపివేశారు. పర్చూరు నియోజకర్గంలో వంకాయలపాడు వద్ద వాగు ఏడు అడుగుల ఎత్తు ప్రవహిస్తుండటంతో పర్చూరు- ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు-మార్టూరు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

క్లుప్తంగా

బాధితులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

- 5 వేల మంది బాధితులకు అందజేత
- మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ పర్యవేక్షణ
- పురపాలక సంఘ పనితీరుపై ఎమ్మెల్యే కోన ప్రశంస



ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న మహిళలు

బాపట్ల అర్బన్: బాపట్లలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణంలోని 5వేల మంది బాధితులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో వంటశాల ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి వంటకాలను చేపట్టారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాలను యుద్ధ ప్రాతిపదికపై సిద్ధం చేశారు. వివిధ వాహనాల ద్వారా బాధితులకు పంపిణీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ స్వయంగా పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి బాధితులకు అందజేసే ఆహార ప్యాకెట్లను పరిశీలించారు. పురపాలక సంఘం చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. బాపట్ల తహసీల్దారు సుధారాణి, మున్సిపల్ ఆర్వో సుబ్బారావు, ఏఈ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఇమామ్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి



చీరాల: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో డ్రెయినేజి కాలువలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. భారీ వర్షం కురవడంతో డ్రెయినేజి పొంగి పొర్లుతోంది. మంగళవారం మధ్యాహ్నం అతడిని గుర్తించిన స్థానికులు బయటకు తీశారు. అప్పటికే అతడు మరణించాడు. మద్యం మత్తులో పడిపోయి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ ఆధారంగా అతడి పేరు పోంద్రంగ డాక్టర్‌గా, సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద నివాసముంటున్న వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు ఒన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహం



మార్టూరు: పంట కాలువలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఇంకొల్లు సమీపంలోని పావులూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామ రైతులు తమ పొలాల సమీపంలో పంట కాలువలు బైక్‌తో సహా ఓ యువకుడు నిర్జీవంగా కనిపించడంతో ఇంకొల్లు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి పరిశీలించారు. యువకుడు తన్నీరు బ్రహ్మయ్య తండ్రి రామయ్య బీసీ కాలనీ మార్టూరుకు చెందిన వ్యక్తిగా తన జేబులోని బైక్ ఆర్సీ ఆధారంగా గుర్తించారు. వివరాలను మార్టూరు పోలీసుస్టేషన్‌కు ఇంకొల్లు పోలీసులు పంపించగా మార్టూరు ఎస్సై శ్రీనివాసరావు వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సత్తెనపల్లి-అమరావతి మార్గంలో వాహనాలు నిలిపివేత

సత్తెనపల్లి: మిచాంగ్ తుఫాన్ ప్రభావం నియోజకవర్గంలో కొనసాగుతుంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీని ప్రభావం మరింతగా ఉండనుందని, ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా నియోజకవర్గ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. అధికారులు అప్రమత్తమయ్యారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పాటుపై నుంచి ఎగువ నుంచి వరద ప్రవహించడం వలన సత్తెనపల్లి మండలం నందిగామ చప్టా పైగా వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సత్తెనపల్లి - అమరావతి మధ్య రాకపోకలను మంగళవారం రాత్రి నిలిపి వేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నందిగామ చప్టాపై నుంచి రాకపోకలు నిషేధించడంతో నందిగామ, గుడిపూడి, పెద్దమక్కెన, మీదుగా అమరావతి వెళ్లి, వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

స్తంభించిన జనజీవనం



పంగులూరు గ్రామంలో నీట మునిగిన పొగాకు పంట



నిజాంపట్నంలో హార్బర్‌లో నిలిచిన బోట్లు

-సాక్షి నెట్‌వర్క్



చీరాల: పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న తీర ప్రాంత ప్రజలు



నిజాంపట్నం ప్రధాన రహదారిలో ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్టు



చీరాల: సముద్ర తీరంలో వలలను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు



బాపట్ల టౌన్: సూర్యలంక వద్ద పహారా కాస్తున్న పోలీసు సిబ్బంది



యర్రంవారిపాలెం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



బాపట్ల: సూర్యలంక వద్ద సముద్రతీరంలో ఈదురుగాలుల దృశ్యం

తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు



అరవపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న మోపిదేవి

రేపల్లె రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాజ్యసభ మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని ఆరవపల్లి గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయటమే కాకుండా రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. తుఫాన్ హెచ్చరికలు వెలువడిన నాటి నుంచి జిల్లా, మండల స్థాయి యంత్రాంగం ప్రజలను చైతన్య భరిస్తూ ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా శ్రమించిందన్నారు. నియోజకవర్గంలో 18 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు వసతి కల్పించినట్లు చెప్పారు. కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఆహారం, మందులు అందిస్తున్నామని చెప్పారు. తుఫాన్ తీవ్రత తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీట మునిగి మొక్కలు వచ్చిన వరి కంకులను ఆయన పరిశీలించి వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు అంజయ్య, ఆరవపల్లి సర్పంచి లోయ బాబు నాంచారయ్య, వ్యవసాయ శాఖ ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

- ప్రభుత్వ ముందస్తు జాగ్రత్తలతో తప్పిన ప్రాణనష్టం
- పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం
- సహకార, మార్కెటింగ్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



కారంచేడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సహకార, మార్కెటింగ్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన మండలంలోని యర్రంవారిపాలెం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద విలేకర్లతో మాట్లాడారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆయన పరామర్శించారు. అనేక మంది రైతులతో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. కలెక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారికి అవసరమైన సూచనలు చేశారన్నారు. అధికార యంత్రాంగం చేసిన కృషితో నష్ట తీవ్రత లేదన్నారు. కేవలం వరి, పొగాకు, శనగ, మొక్కజొన్న వంటి పంటలను మాత్రమే రైతులు నష్టపోయారన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వరద తీవ్రత తగ్గిన వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది పంట నష్టం అంచనాలు వేస్తారన్నారు. వీటి ఆధారంగా పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ఎవ్వరూ అధైర్య పడొద్దన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో నిమగ్నమైన ప్రతి అధికారికి అభినందనలు తెలిపారు. మండలంలోని యర్రంవారిపాలెం గ్రామంతోపాటు మరికొన్ని గ్రామాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటును ఆయన అభినందించారు. ఆయన వెంట యర్రం లక్ష్మారెడ్డి, గుదిబండి అంజిరెడ్డి, స్థానిక నాయకులు, రైతులున్నారు.

జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్ (రీ సర్వే, భూమి రికార్డుల శాఖ)ను పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వేకి సంబంధించి టీం వర్క్‌గా పని చేసేందుకు ఈ సెంటర్ దోహద పడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సంబంధించిన రీ సర్వే, భూమి రికార్డులకు సంబంధించి ఇక్కడ పనిచేసుకోవడానికి అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. సెంటర్‌కు కావలసిన సిస్టమ్స్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

తీర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



పునరావాస కేంద్రాల్లో ఉన్న వారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

చీరాల: మిచాంగ్ తుఫాన్ విపత్తులో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలెవ్వరూ ఆందోళన పడొద్దని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో మంగళవారం చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్రతీర ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించి అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. అలానే తుఫాన్ షెల్టర్లలో ఉన్న వారిని పరామర్శించారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అందరం సిద్ధంగా ఉన్నామన్నారు. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఎటువంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనేందుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. చప్టాలు, రోడ్లపై నీరు ప్రవహించే ప్రదేశాల వద్ద పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు అవసరమైన చోట్ల సేవలందిస్తున్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్‌శాఖ తక్షణ సహాయం కోసం డయల్ 100, 112 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆందోళన చెందవద్దు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: తుఫాన్ విపత్తుపై జిల్లాలోని ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విపత్తును ఎదుర్కొవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా సిబ్బందితో కలిసి ఎస్పీ పర్యటించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. చప్టాలు, రోడ్ల మీద నీరు ప్రవహించే ప్రదేశాల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి పికెట్లు వేసి ప్రాణాపాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట్ల ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులలో పోలీస్ శాఖ తక్షణ సహాయం కోసం జిల్లా ప్రజలు డయల్ 100, 112 పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8333813228 సమాచారమివ్వాలన్నారు. 114 మంది సిబ్బందితో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 132 మంది పోలీస్ సిబ్బందిని కల్వర్టులు, బ్రిడ్జ్‌ల వద్ద నియమించామని, ప్రజలను అటుగా వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నారన్నారు. సుమారు 300 మందిని ప్రజలకు సహాయక చర్యలు అందించడానికి నియమించామన్నారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఈదురుగాలులకు రోడ్లపై విరిగిపడిన చెట్లను పోలీస్ అధికారులు వెంటనే జేసీబీల ద్వారా తొలగించి ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతల్లోని ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

సత్తెనపల్లి: భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గౌస్ మొహిద్దీన్ మంగళవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు మండలం ముసాపురం గ్రామానికి చెందిన దాసరి రాజ్యలక్ష్మి 2017 నవంబర్ 1న తన భర్త రాంబాబు అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని గుంటూరు దిశా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై వాదోపవాదనల అనంతరం మంగళవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. రాజ్యలక్ష్మిని మానసికంగా, శారీరకంగా వేధించినందుకు రాంబాబుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 5వేలు అపరాధ రుసుం విధించారు. అదనపు కట్నం కోసం వేధించినందుకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు అపరాధ రుసుం విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రసాద్ నాయక్ వ్యవహరించారు.

సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్
- ముగిసిన అగ్రిటెక్ వ్యవసాయ సాంకేతిక సదస్సు



అలరించిన స్టాల్స్‌కు బహుమతులు అందజేస్తున్న వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి

గుంటూరురూరల్: వ్యవసాయంలో ప్రస్తుతం దిగుబడి ఎంత వచ్చిందనేది కాకుండా నికర ఆదాయం ఎంత వచ్చిందనే విషయం ప్రాధాన్యత సంతరించుకుందని జీతాయ నూనెగింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్) డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తాధ్వర్యంలో లాం నందున్న విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అగ్రిటెక్ - 2023 వ్యవసాయ సాంకేతిక సదస్సు మంగళవారంతో ముగిసింది. సదస్సు మూడోరోజు అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా మిల్లెట్ ఫెస్ట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణలో భాగంగా ఉపయోగించే డ్రోన్లు, కోత యంత్రాలు కుసుమ లాంటి పంటల్లో ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. మొక్కలు ఎక్కువగా ముల్లులు కలిగి ఉన్న పంటల్లో మనుషులతో వ్యవసాయ యాజమాన్య పద్ధతులు చేపట్టేందుకు వీలు కాని పంటలకు ఇవి ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. సెన్సార్ బేస్డ్ నీటిపారుదల పరికరాలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా మారాయన్నారు. జాతీయ చిరుధాన్యాల సంస్థ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ చిరుధాన్యాలు 4 వేల సంవత్సరాల నుంచి నుంచి సాగులో ఉన్నాయని గుర్తుచేశారు. చిరుధాన్యాల సాగులో మెలకువలను డాక్టర్ మాధవీలత వివరించారు. చిరుధాన్యాలు విజయవంతంగా సాగు చేస్తున్న రైతు రేనాటి రామసుబ్బారెడ్డి తన అనుభవాలను వివరించారు. చిరుధాన్యాలను శుభ్రపరిచే యంత్రాలు, సాగు చేసే విధానాలు రైతు విజయభూషణ్‌రెడ్డి, చిరుధాన్యాల విలువల పెంపుపై, మార్కెటింగ్‌లను నరసింహనాయక్‌లు వివరించారు. గత రెండు రోజులుగా ప్రదర్శనను తిలకించి తమ అభిప్రాయాలను చక్కగా వివరించి క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. రైతులు, విద్యార్థులు ప్రేక్షకులను ఆకట్టుకున్న మొదటి మూడు స్టాల్స్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు, హోండా కంపెనీకి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పాలక మండలి సభ్యులు డాక్టర్ చైతన్యకుమారి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.